సాక్షి
బాపట్ల
సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



బీసీ సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

వినుకొండ: నరసరావుపేటలో ఈ నెల 11న నిర్వహించనున్న బీసీ సమరభేరి సభ వాల్ పోస్టర్‌ను ఆదివారం వినుకొండలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల రాజు ఆవిష్కరించారు.



చలివేంద్రం ప్రారంభం

పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ ఆధ్వర్యంలో స్థానికంగా చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: వడ్లమూడి వారిపాలెంలోని పాటి మీద ఆంజనేయ స్వామి తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. భక్తులు ప్రభలతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్‌రీల్

సముద్రంలోకి 231 తాబేలు పిల్లలు



చినగంజాం: మండలంలోని కుంకుడు చెట్ల పాలెం గ్రామ తీరంలో ఆదివారం 231 తాబేలు పిల్లలను సముద్రంలోనికి వదలి పెట్టారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్, ఐటీసీ బంగారు భవిష్యత్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి వీటిని ట్రీ ఫౌండేషన్, ఐటీసీ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శవనం చంద్రారెడ్డి, జిల్లా సమన్వయకర్తలు వదలి పెట్టారు. ఐటీసీ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సూరజ్ ప్రధాన్ మాట్లాడుతూ మొత్తం 16 తాబేళ్ల నుంచి 1,686 గుడ్లు సేకరించి పొదిగించామన్నారు. సముద్ర రక్షణ దళ సభ్యులు కారాణి శ్రీను, వాటుపల్లి సుబ్బారావు, కారాని భావన్నారాయణ పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై శ్రీరామ నవమి



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్నజీయర్ స్వామి మంగళాశాసనాలతో వసంత నవరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు శ్రీరామ నవమి ఉత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. హనుమ లక్ష్మణ సమేత శ్రీసీతారామచంద్రులకు అభిషేక మహోత్సవం, సంక్షేప రామాయణ హవనం, సుందరకాండ పారాయణం జరిగాయి. సీతారామ చంద్రులకు అష్టోత్తర శతనామార్చన, శ్రీ సీతారామ చంద్రులకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

పేదల నోటికందితే ఒట్టు!

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల కడుపు నిండే పరిస్థితి కూడా లేదు. వారికి అందించే రేషన్ సరకులపై అక్రమార్కుల కన్ను పడింది. కూలీనాలీ చేసుకుని కడుపు నిండితే చాలనుకునే పేద ప్రజల కోసం పౌర సరఫరాల శాఖ అందించే రేషన్ సరకులను కొందరు నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నెల ప్రారంభంలో పేదలు ఎదురు చూసే సరకులు పూర్తిస్థాయిలో అందకపోవటంతో పస్తులుండాల్సి వస్తోంది.

- కూటమి పాలనలో అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ
- మూడు నెలలుగా ఆగిపోయిన రేషన్ కందిపప్పు
- ఎప్పుడు ఏ సరకులిస్తారో కూడా తెలియని వైనం
- నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ప్రభుత్వంపై ప్రజాసంఘాలు, కార్డుదారులు ఆగ్రహం



పట్టణంలో రేషన్ సరకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రేపల్లె రూరల్: రేషన్ దుకాణాలలో అందించే వస్తువులను కొంతమంది అక్రమార్కులు అదనపు ధర చెల్లించి డీలర్ల నుంచి కొనుగోలు చేస్తున్నారు. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.130 నుంచి రూ.170 వరకు ఉంది. పంచదార రూ.45 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. రేషన్ దుకాణంలో కందిపప్పు కిలో రూ.67, పంచదార అరకిలో రూ.17లకు విక్రయిస్తున్నారు. డీలర్ల నుంచి అక్రమార్కులు బియ్యంతోపాటు కందిపప్పు కూడా నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

సక్రమంగా అందని సరకులు

ప్రతి నెల ఏ వస్తువు ఇస్తారో కొనుగోలు చేసే వరకు తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కేవలం బియ్యం, పంచదారలు మాత్రమే పేదలకు అరకొరగా అందుతున్నాయి. కందిపప్పు, గోధుమ పిండి, బెల్లం, శెనగలు సైతం పంపిణీ చేయాలి. తూకం తక్కువగా ఉందన్న నెపంతో పంచదారను రెండు నెలలపాటు నిలుపుదల చేశారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో పంచదార పంపిణీ పునఃప్రారంభించారు. ప్రస్తుతం శ్రీరామనవమికైనా కందిపప్పు ఇస్తారని ఆశగా ఎదురుచూసిన కార్డుదారులకు నిరాశే ఎదురైంది. సరకులు పక్కదారి పట్టడంపై ప్రజాసంఘాల వారు, లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

3 నెలలుగా కందిపప్పు లేదు..

రేపల్లె నియోజకవర్గంలోని కార్డుదారులకు మూడు నెలల నుంచి కందిపప్పు ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెండు నెలలు కందిపప్పు నిలుపుదల చేశారు. తరువాత తూతూమంత్రంగా మూడు నెలల పాటు 30శాతం మాత్రమే సరఫరా చేశారు. ఫిబ్రవరి నుంచి కందిపప్పు అందించటం లేదు. నియోజకవర్గంలో 226 రేషన్ దుకాణాల పరిధిలో 68,015 మంది కార్డుదారులు ఉన్నారు.

నిఘా పెంచుతాం



రేషన్ సరకులు నల్లబజారుకు తరలిస్తున్నట్లు ఎటువంటి సమాచారం లేదు. ఎక్కడైనా ఇలా జరిగితే వివరాలు చెప్పాలని ప్రజలను కోరుతున్నాం. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. రేషన్ దుకాణాలపై నిత్యం నిఘా ఉంచుతాం.

– ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్, రేపల్లె

బోర్డులు ఏర్పాటు చేయాలి



వార్డులకు వచ్చే రేషన్ వాహనాలపై బోర్డులు ఏర్పాటు చేసి కార్డుదారులకు అందించే రేషన్ వివరాలను ప్రదర్శించాలి. గ్రామాలలో నిర్ణీత తేదీలలో ఇచ్చిన విధంగా పట్టణంలోని వార్డులలో కూడా చేయాలి. వాహనాల వద్ద సరకులు తీసుకోని వారికి దుకాణాలలో అందించాలి. అధికారులు నిరంతరం నిఘా ఉంచాలి.

– సి.వి. మోహనరావు, పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి, రేపల్లె

నటనకు మూలం రంగస్థలమే

- స్ఫూర్తి నిచ్చేవి నాటకాలే... నేర్చుకోవాల్సింది ఇక్కడే...!
- ప్రముఖ నటుడు అజయ్‌ఘోష్



యడ్లపాడు: టీవీ, సినిమా, వెబ్‌సిరీస్, టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి సాధించినా అన్నింటికీ మూలం రంగస్థలం అన్నది నిజం. అది అనంతమైనది.. అజరామరమైనదని ప్రముఖ సినీ నటుడు అజయ్‌ఘోష్ పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం మూడోరోజు ఆదివారం జరిగే కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళానిలయం అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబుతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు.

సామాన్య ప్రేక్షకుడిగానే వచ్చా..

వెండితెర, బుల్లితెర, ఓటీటీ వంటి విభాగాలెన్ని ఉన్నా అందులో నిలదొక్కుకోవాలంటే నాటకరంగం నుంచి వచ్చిన కళాకారులకే సాధ్యమవుతుందని అజయ్‌ఘోష్ తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్న వారు తమ ప్రతిభను చాటి ఆయా పరిశ్రమల్లో రాణించగలుగుతారన్నారు. సుందరయ్య కళానిలయం వారు తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించినా, తాను మాత్రం వినోదంతో పాటు సందేశాల్ని అందించే పరిషత్ నాటికలను వీక్షించేందుకు వచ్చిన ఓ సామాన్య ప్రేక్షకుడినే వచ్చానని తెలిపారు. నాటక రంగం అంటే తనకెంతో ఇష్టమని, నిరంతరం దానినుంచి చాలా విషయాలను నేర్చుకునేందుకే ఎక్కువగా ఇష్టపడతానని తెలిపారు. ముఖ్యంగా నాటక రచన, అందులోని మాటలు, కళాకారుల నటనా చాతుర్యాలు తనకెంతో స్ఫూర్తినిస్తాయన్నారు. తాను రంగస్థలంలో నిత్య విద్యార్థినేనని తెలిపారు.

కృషి అభినందనీయం..

యడ్లపాడు అభ్యుదయ, కమ్యూనిజం భావజాలం కలిగిన గ్రామమని, సంస్కృతికి కళలే ఆయువు పట్టన్నారు. సమాజంలో ఒక మార్పును తీసుకురావాలనే గొప్ప ఉద్దేశంతో గత 22 సంవత్సరాలుగా నాటకోత్సవాలను నిర్వహించడం అద్భుతమని కొనియాడారు. వీటి నిర్వహణ కోసం అందరూ సమష్టిగా కృషి చేయడం అభినందనీయమన్నారు. కళాకారులను, రచయితలు, దర్శకులను తమ కుటుంబ సభ్యుల్లా ఆదరించడం, కళాసేవల్ని అందించిన ప్రముఖుల్ని పురస్కారంతో సత్కరించడం, మహిళా ఆర్టిస్టులకు ఆడపడుచు లాంఛనాలతో సారెనిచ్చి సత్కరించడం పల్లె సంస్కృతికి నిదర్శనమన్నారు.

తల్లీకుమారుడిని బలిగొన్న ట్రాక్టర్

- ద్విచక్రవాహనంపై వస్తుండగా ఘటన
- అక్కడికక్కడే కుమారుడు మృతి
- చికిత్స పొందుతూ తల్లి మృత్యువాత





శివయ్య, చిట్టెమ్మల మృతదేహాలు

బాపట్ల టౌన్ : ట్రాక్టర్ రూపంలో వచ్చిన మృత్యువు తల్లీకుమారుడిని బలిగొంది. ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో కుమారుడు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన తల్లిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని మచ్చావారిపాలెం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న పెర్ల శివయ్య (45) తన తల్లి చిట్టెమ్మను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని బాపట్ల వైపు నుంచి జగనన్నకాలనీ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో పెర్ల శివయ్య అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి చిట్టెమ్మకు రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు స్పందించి చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ చిట్టెమ్మ(70) మృతి చెందింది. శివయ్యకు భార్య భవాని, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిట్టెమ్మకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. శివయ్య నాలుగో సంతానం. రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకు ఒక్కసారే మృతి చెందడంలో ఏరియా వైద్యశాలలో కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. బాపట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తి'రోగ'మనం

- ఆధునిక జీవన శైలితో రోగాలు
- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంత సమాజం
- నకాలంలో వైద్యులను సంప్రదిస్తే మెరుగైన ఫలితాలు
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

గుంటూరు మెడికల్: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. ఆరోగ్యం లేకపోతే కోట్లాది రూపాయలు ఉన్నా సుఖం లేనట్టే.. ప్రస్తుత జీవన శైలితో ప్రపంచ ఆరోగ్యం తిరోగమన బాట పడుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా రోగాలు పెరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ 1948లోనే గుర్తించింది. తొలిసారిగా వరల్డ్ హెల్త్ అసెంబ్లీని ఏర్పాటు చేసింది. ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించాలని ఈ అసెంబ్లీ 1950లో తీర్మానించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, అందరూ ఆరోగ్యంగా జీవించేలా చేయటమే దీని ముఖ్యఉద్దేశం. రోగాలు వచ్చిన తర్వాత వైద్యుల దగ్గరకు పరిగెట్టడం కంటే ముందు జాగ్రత్త చర్యలతో ఆరోగ్యంగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు.





వరల్డ్ హెల్త్ డే పోస్టర్

ఎన్‌సీడీ-3.0

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై దృష్టిపెట్టింది. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు గత ఏడాది నవంబరులో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ 3.0) కార్యక్రమం పేరుతో స్క్రీనింగ్ పరీక్షలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్‌తోపాటు, పలు రకాల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యం అందించేందుకు ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

8,75,977 మందికి స్క్రీనింగ్ పరీక్షలు

గుంటూరు జిల్లాలో 18 ఏళ్లు దాటిన జనాభా 17,50,399 మంది ఉన్నారు. వీరిలో 8,75,977 మందికి వైద్యసిబ్బంది స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వీరిలో మధుమేహం అనుమానితులు 23,103 మంది ఉండగా, 4,438 మందికి మధుమేహం ఉన్నట్లు నిర్ధారణైంది. ఇప్పటికే షుగర్‌తో 1,17,609 మంది చికిత్స పొందుతున్నారు. బీపీ అనుమానిత బాధితులు 23,294 మంది ఉండగా, 4,635 మందికి బీపీ ఉన్నట్లు నిర్ధారణైంది. ఇప్పటికే బీపీతో 1,33,419 మంది చికిత్స పొందుతున్నారు. క్యాన్సర్ అనుమానిత కేసులు 94 ఉండగా, క్యాన్సర్ ఉన్నట్టు ఆరుగురికి నిర్ధారణైంది. క్యాన్సర్ రోగులను గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు.

గుండె ఎంతో కీలకం



శరీరంలోని అన్ని అవయవాలోకెల్ల గుండె ప్రధానమైంది. లబ్‌డబ్‌మంటూ ప్రతి నిమిషం కొట్టుకుంటూ ఉంటేనే మనిషి ప్రాణాలతో ఉన్నట్లు లెక్క. గుండె కోసం తప్పని సరిగా రోజూ వ్యాయామం చేయాలి. మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలి. నూనె అధికంగా ఉండే పదార్థాలు, చికెన్, మాంసం లాంటి కొవ్వు అధికంగా ఉండే పదార్థాలను తినకూడదు. ఆకు, కాయగూరలు తీసుకోవాలి. ఉప్పును సాధ్యమైనంత తక్కువగా వినియోగించాలి. బీపీ, షుగర్‌లను నియంత్రణలో పెట్టుకోవాలి. ధూమపానం, మద్యపానం లాంటి వ్యసనాల జోలికి వెళ్లకూడదు. ఒత్తిడి లేకుండా ఉండాలి.

–డాక్టర్ పోలవరపు అనురాగ్,
ఇంట్రావెన్షనల్ కార్డియాలజిస్టు, గుంటూరు

బీపీ, షుగర్‌లను అదుపులో పెట్టుకోవాలి



అనేక శారీరక రుగ్మతలకు రక్తపోటు, మధుమేహం ప్రధాన కారణాలవుతున్నాయి. ఇవి అదుపులో లేకపోతే మూత్రపిండాలు, గుండె ఫెయిలవుతాయి. దృష్టిలోపాలు వస్తాయి. పక్షవాతం కూడా వస్తుంది. రోజూ ఉప్పు వాడకం 5 గ్రాముల కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలి. బీపీ వయస్సుతో సంబంధం లేకుండా, వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉంది. అదుపులో పెట్టేందుకు రోజూ యోగా చేయాలి. పొటాషియం, క్యాల్షియం ఉండే పాలు, పండ్లు లాంటి ఆహారాన్ని తగినంత తీసుకోవాలి.

–డాక్టర్ రేపూరి హరికృష్ణ,
ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, గుంటూరు.

ఆరు నెలలకోసారి కిడ్నీ పరీక్షలు అవసరం



కాళ్లవాపులు, మూత్రం ఎక్కువసార్లు రావటం, మూత్రంలో మంట, రక్తం కారటం, ఆకలి లేకపోటం, వాంతులు వంటి లక్షణాలు కన్పిస్తే కిడ్నీలకు వ్యాధి సోకినట్లు అర్థం చేసుకోవాలి. కుటుంబంలో ఒకరికి ఉంటే వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా ముందస్తుగా పరీక్షలు చేయించుకోవటం మంచిది. నొప్పి మాత్రలు ఎక్కువగా వాడటం, నాటు మందులు వాడటం, బీపీ, షుగర్‌లు అదుపులో లేకపోవటం వల్ల మూత్రపిండాలు పాడవుతాయి. బీపీ, షుగర్‌లు ఉన్నవారు ప్రతి 6 నెలలకు ఒకసారి కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ చింతా రామకృష్ణ,
సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

ఆటోను ఢీకొట్టిన కారు.. నలుగురికి గాయాలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): పని ముగించుకుని ఆటోలో వస్తున్న కూలీలు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆటోను కారు ఢీకొట్టడంతో వారిలోని నలుగురు గాయపడ్డారు. ఆదివారం సంతమాగులూరు మండలంలోని నామ్ రహదారిపై ఉన్న కొమ్మాలపాడు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై పట్టాభిరామయ్య కథనం మేరకు.. బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామానికి చెందిన కూలీలు ఆదివారం ఉదయం పనికి ఆటోలో వెళ్లారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా సంతమాగులూరు మండలం నామ్ హైవే కొమ్మాలపాడు వద్దకు వచ్చేసరికి ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బి.సుశీల, బుల్లెమ్మ, వెంకటలక్ష్మి, సుబ్బాయమ్మలు గాయాలపాలయ్యారు. వెంటనే వారిని 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

19 మంది జూదరులు అరెస్ట్

కారంచేడు: పేకాట ఆడుతున్న 19 మందిని పోలీసులు సినీ ఫక్కీలో అరెస్టు చేశారు. పక్కా సమాచారం అందుకున్నాక ఆదివారం సాయంత్రం మండలంలోని కుంకలమర్రు గ్రామ శివారు పొలాల్లో పేకాట స్థావరంపై 20 మంది పోలీసులు దాడి చేశారు. వీరందరూ మఫ్టీలో లుంగీలు, టీషర్టులు వంటివి ధరించి వెళ్లారు. దీంతో పేకాట ఆడుతున్న వారు గుర్తించలేకపోయారు. పోలీసులు 19 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.80 లక్షల నగదు, 10 ద్విచక్ర వాహనాలు, 19 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టుకు హాజరుపరుస్తామని ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య తెలిపారు.

క్లుప్తంగా

ఏఎంసీ చైర్మన్ పదవి రాక తమ్ముళ్ల నైరాశ్యం

పర్చూరు(చినగంజాం): పర్చూరు ఏఎంసీ చైర్మన్ పదవి నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నేతలను ఊరించి ఉసూరుమనిపించింది. ఇది పర్చూరు నియోజకవర్గ పరిధిలో అతిపెద్ద నామినేటెడ్ పదవి. శాసన సభ్యుడి తరువాత నియోజకవర్గంలో అంతటి హోదా కలిగిన పదవి కావడంతో ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల పలువురు టీడీపీ నేతలు దీనిని ఆశించి భంగపడ్డారు. ఆశావహులు నుంచి స్థానిక శాసనసభ్యుడిపై ఒత్తిడి తీవ్రమైంది. పర్చూరు నుంచి తొలుత ఏఎంసీ చైర్మన్ పదవి జనరల్ మహిళ కావడంతో బోడవాడ, నూతలపాడు, కొల్లావారిపాలెం, జాగర్లమూడి, స్వర్ణ, చినగంజాం గ్రామాలకు చెందిన పార్టీ సీనియర్ నేతలు పోటీ పడ్డారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని రిజర్వేషన్ కేటగిరీని మార్చి బీసీలకు వచ్చేలా చేశారు. కష్టపడి పార్టీ గెలుపు కోసం ఖర్చుపెట్టి పని చేస్తే తమకు చైర్మన్ పదవి దక్కలేదని పలువురు టీడీపీ నేతలు నైరాశ్యంలో ఉన్నారు. తమ ఆవేదనను సన్నిహితుల వద్ద వెలిబుచ్చారని సమాచారం.

ప్రయాణికుడికి బ్యాగు అప్పగింత

ఇంకొల్లు(చినగంజాం): ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగును ఇంకొల్లు ఆర్టీసీ బస్టాండులోని కంట్రోలర్ తిరిగి అప్పగించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతంలో పంచాయతీ గుమస్తాగా పనిచేసే జితేంద్రరెడ్డి ఆదివారం పని నిమిత్తం ఒంగోలు నుంచి ఇంకొల్లుకు ఆర్టీసీ బస్సులో వచ్చారు. దిగే సమయంలో బ్యాగును బస్సులో మరచిపోయారు. కంట్రోలర్ బాబుకు చెప్పడంతో వెంటనే ఆయన సదరు బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసి బ్యాగు తిరిగి తెప్పించి యజమానికి అప్పగించారు.

సాగర్ కాల్వలో దూకిన వృద్ధుడు



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ కుడి కాలువలోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన మునగాల సుబ్బారావు(63) అనే వృద్ధుడిని విజయపురిసౌత్ ఎస్‌ఐ మహమ్మద్ షఫీ తన సిబ్బందితో కలిసి కాపాడారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సుబ్బారావు ఆదివారం సాగర్ కుడి కాలువలో దూకి ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఎస్‌ఐ షఫీ పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న సుబ్బారావును తాళ్లు వేసి బయటకు తీశారు. సుబ్బారావు సురక్షితంగా బయటపడటంతో పోలీసులను స్థానికులు అభినందించారు.

పాస్టర్ మృతిపై విచారణకు డిమాండ్



దేశాయిపేట నుంచి వేటపాలెం గడియార స్తంభం సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

భారీ ర్యాలీకి తరలివచ్చిన వందల మంది క్రైస్తవులు

వేటపాలెం: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పాస్టర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ చార్లెస్ ఫీన్నీ డిమాండ్ చేశారు. ఆదివారం వేటపాలెం క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు ఆధ్వర్యంలో వందల మందితో దేశాయిపేట నుంచి వేటపాలెం గడియార స్తంభం సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ.. ప్రవీణ్ పగడాలను హత్య చేశారనే నమ్ముతున్నామని, ఒక దైవజనుడిని హత్య చేస్తే క్రైస్తవ్యం ఆగిపోతుందనుకుంటే అది పొరపాటే అన్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. ఒక్క ప్రవీణ్‌ను చంపితే వందలాది మంది ప్రవీణ్‌లు పుట్టుకొస్తారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం క్రైస్తవుల రక్షణకు భరోసా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అన్నాలదాసు భాస్కర్‌రావు, పాస్టర్ సత్యంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రగోరి, మండల దైవ సేవకులు, మహిళలు పాల్గొన్నారు.

పోరాట యోధుడు పాపిరెడ్డి

- జీవితమంతా ప్రజల కోసం తపించిన నేత
- సేవా కార్యక్రమాల్లోనూ ముందు
- ప్రముఖుల సంతాపం



మృతి చెందిన మోదుగుల పాపిరెడ్డి

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ సోషలిస్ట్ ఫ్రంట్ యోధుడు మోదుగుల పాపిరెడ్డి (88) ఆదివారం కన్నుమూశారు. ఈయన వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి తండ్రి. పాపిరెడ్డి పౌర హక్కుల కోసం జీవితాంతం పోరాడారు.

పాపిరెడ్డి ప్రస్థానం

మోదుగుల పాపిరెడ్డి గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో 1937 అక్టోబర్ 9న వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆయన ఎంఏ, ఎల్ఎల్‌బీ వరకూ చదివారు. 1961లో గుంటూరులో న్యాయవాది వృత్తిలో కొనసాగారు. విద్యార్థి దశలోనే ఆయన సోషలిస్ట్ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. సోషలిస్ట్ పార్టీకి తన జీవితాన్ని అంకితం చేశారు. 1955లో రామ్‌మనోహర్ లోహియా గుంటూరుకు వచ్చినపుడు ఆయన ప్రసంగాలతో పాపిరెడ్డి ప్రభావితమయ్యారు. లోహియాకు అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. సోషలిస్ట్ ఉద్యమ నేతలైన మధులిమాయే, రాజ్‌నారాయణ్, మధుదండావతే, జార్జి ఫెర్నాండేజ్ తదితరులతో కలిసి జాతీయస్థాయిలో పనిచేశారు. 1975లో లోక్‌నాయక్ జయప్రకాష్‌నారాయణ నిర్వహించిన ఉద్యమంలో పాల్గొని ఐదు నెలలు అజ్ఞాత జీవితం గడిపారు. 1975 నవంబర్ 14న అరెస్టు అయ్యారు. 1977 జనవరి వరకు రాజమండ్రి, సికింద్రాబాద్ జైళ్లలో ప్రభుత్వం ఆయనను నిర్బంధించింది. పాపిరెడ్డితోపాటు ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ బి.సత్యనారాయణరెడ్డి, బీజేపీ నాయకులు జూపూడి యజ్ఞనారాయణ, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, కాతా జనార్దనరావు తదితరులు జైల్లో కలిసి ఉన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని కాండ్లరేవు సత్యాగ్రహంలో జార్జిఫెర్నాండేజ్‌తో కలిసి పాపిరెడ్డి పాల్గొన్నారు. ఓపీడీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై పౌరహక్కుల ఉద్యమంలో పాల్గొన్నారు. కార్మికుల ఆకలిచావులను నిరసిస్తూ 1989లో గుంటూరు కలెక్టరేట్ వద్ద పాపిరెడ్డి ఆమరణ నిరాహార దీక్షను చేశారు. ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు. పాపిరెడ్డి తెలుగు భాషాభిమాని. తమిళనాడులో హోసూరు, కృష్ణగిరి జిల్లాల్లో పాదయాత్రలు జరిపి తెలుగు భాషాభివృద్ధి కోసం పోరాడారు. బరంపురంలో జరిగిన అఖిల భారత తెలుగు మహాసభల విజయానికి చీఫ్ పాట్రన్‌గా ఎంతో కృషి చేశారు. అఖిల భారత తెలుగు సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై భాష కోసం పాటుపడ్డారు.

ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ఉద్యమాలు

ఎమర్జెన్సీ సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా పాపిరెడ్డి ఎన్నో ఉద్యమాలు చేశారు. ప్రజల స్వాతంత్ర్యాన్ని కాంగ్రెస్ హరిస్తుందంటూ గళమెత్తారు. పాపిరెడ్డికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాన్ని అందించింది. వందలాది పురస్కారాలు పాపిరెడ్డిని వరించాయి. ఆయన సేవా కార్యక్రమాల్లోనూ ముందుండేవారు. పెదపరిమి గ్రామంలో ఆర్‌సీఎం స్కూలు కమిటీ కన్వీనర్‌గా పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. తాడికొండలో సత్యసాయిబాబా కళాశాల పాలకవర్గ సభ్యుడిగా పనిచేశారు. పెదపరిమి గ్రామంలో వినాయకుడి ఆలయాన్ని నిర్మించారు.



పాపిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న అంబటి రాంబాబు



మోదుగుల పాపిరెడ్డి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న కుటుంబసభ్యులు

పలువురి సంతాపం

మోదుగుల పాపిరెడ్డి మృతి వార్త తెలిసి గుంటూరు జిల్లాతోపాటు పలు జిల్లాల్లో ఆయన ఆత్మీయులు, అభిమానులు, రాజకీయ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఆయన నివాసంలో పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు మేరుగ నాగార్జున, ఆళ్ల రామకృష్ణారెడ్డి, వణుకూరి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సుధీర్ భార్గవ్‌రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, మోపిదేవి వెంకటరమణ, కోవెలమూడి రవీంద్ర, రాయపాటి శ్రీనివాస్, రావెల కిషోర్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, బీజేపీ నేత జూపూడి రంగరాజు ఉన్నారు.

ఒకే జైలులో ఉన్నాం : యలమంచిలి శివాజీ

పాపిరెడ్డి మృతికి రైతు నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో పాపిరెడ్డి తాను ఒకే జైలులో ఉన్నామని గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ కూడా పాపిరెడ్డి మృతికి సంతాపం తెలిపారు.

అంబటి నివాళి

పాపిరెడ్డి మృతికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు నివాళి అర్పించారు. పాపిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అలాగే సీపీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కూడా పాపిరెడ్డి మృతికి సంతాపం తెలిపారు.

మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ

పెదకూరపాడు: మద్యం మత్తులో యువకుల మధ్య గొడవ చోటుచేసుకున్న సంఘటన పెదకూరపాడులోని అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడుకు చెందిన బంకా భరత్ మద్యం తాగి స్థానిక అంబేడ్కర్ బొమ్మ వద్ద ఉన్న ముగ్గురు రాజుల దేవాలయం ప్రహరీ వద్ద మూత్రం పోస్తుండగా అక్కడే ఉన్న కొంతమంది యువకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య తోపులాట జరిగింది. భరత్‌కు గాయాలయ్యాయి. భరత్ కుటుంబసభ్యులకు, స్నేహితులకు సమాచారం ఇచ్చి వారితో కలసి వచ్చి అంబేడ్కర్ బొమ్మ వద్ద ఉన్న బాకీ చిన్నముసలయ్య తలపై బీరు బాటిల్‌తో గాయపర్చారు. ఇరువురిని చికిత్స నిమిత్తం అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అప్రమత్తమైన పోలీసులు అంబేడ్కర్ బొమ్మ వద్ద బందోబస్తు నిర్వహించారు. సంఘటన స్థలాన్ని సీఐ పత్తిపాటి సురేష్, ఎస్‌ఐ గిరిబాబులు పరిశీలించారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

నాదెండ్ల: మండలంలోని ఎండుగుంపాలెం గ్రామంలో కొలువైయున్న అక్కాయగుంట సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, నూజెండ్లపల్లి అమ్మవారి దేవస్థానం తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. దేవస్థాన కమిటీ చైర్మన్ సాగి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఆలయ పూజారి వివేక్‌వర్మ ఉదయాన్నే స్వామివారిని అలంకరించి పూజాభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. 200 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఈ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇర్లపాడు, ఎండుగుంపాలెం గ్రామం, రాజుపాలెం, బుక్కాపురం, గంగన్నపాలెం మొక్కుబడుల ప్రభలు తరలి వచ్చాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ ఆలయం గ్రామ శివారులో ఉండటంతో దారి పొడవునా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రెండు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, పానకం, వడపప్పుతో పాటూ భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను గ్రామ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. పొట్టేళ్లతో బండి కట్టి గ్రామ ప్రభను తరలించటం భక్తులను ఆకట్టుకుంది.

ఇద్దరు విదేశీ విద్యార్థుల విచారణ

మంగళగిరి: నగరంలో మత్తుపదార్థాలు కొకైన్, గంజాయి విక్రయాలు బయటపడిన నేపథ్యంలో అధికారులు నగరంలోని ప్రైవేటు యూనివర్సిటీలపై దృష్టి సారించారు. ఆదివారం వడ్డేశ్వరంలోని ఓ యూనివర్సిటీలో చదువుతున్న ఇద్దరు విదేశీ విద్యార్థులను ఈగల్(ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) బృందం అదుపులోకి తీసుకుని మూడు గంటలపాటు విచారణ చేసింది. ఆతర్వాత మళ్లీ వర్సిటీలో వదిలివెళ్లినట్లు సమాచారం. కొకైన్(ఎండీఎంఏ)లాంటి మత్తుపదార్థాలు ఏమైనా వీరి నుంచి యూనివర్సిటీ విద్యార్థులకు అందుతున్నాయా అనే కోణంలో విచారణ చేసినట్టు సమాచారం.

8వ అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి



తాడేపల్లి రూరల్ : కుంచనపల్లిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నుంచి వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన ఘటనపై తాడేపల్లి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఖాజావలి కథనం ప్రకారం కుంచనపల్లి అపర్ణ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ 8వ ఫ్లోర్‌లో తుళ్లూరు మండలం వెంకటపాలెంకు చెందిన పాటిబండ్ల సదాశివరావు (53) ఆయన భార్య మాధవి, కుమార్తె నివాసం ఉంటున్నారు. ఉదయం బాల్కనీలో వాకింగ్ చేస్తుండగా సదాశివరావు కళ్లుతిరిగి 8వ అంతస్తు పైనుంచి కిందకి పడిపోయాడు. అక్కడికక్కడే మరణించాడు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఖాజావలి తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

పిడుగురాళ్ల: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించి నడికుడి రైల్వే ఎస్‌ఐ వి.శ్రీనివాసరావు నాయక్ తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి పిడుగురాళ్ల, న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ల మధ్య, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపాడు. ఇతని వయసు సుమారు 40 సంవత్సరాల పైనే ఉండవచ్చునన్నారు. ఆచూకీ తెలియలేదని, ఇతనికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే నడికుడి రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం మృతదేహాన్ని మార్చురీలో ఉంచామన్నారు.

మాజీ ప్రియురాలిపై రౌడీ షీటర్ దాడి

- మాట్లాడటం లేదంటూ వేధింపులు
- వెంటబడి వచ్చి తీవ్రంగా దాడి
- మహిళ ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు
- మేజిస్ట్రేటు ఎదుట హాజరుతో రిమాండ్‌కు ఆదేశాలు

తెనాలి: స్థానిక అయితానగర్‌కు చెందిన రౌడీషీటర్ లడ్డూ, గతంలో తనకు సన్నిహితంగా ఉన్న మహిళపై తీవ్రంగా దాడిచేశాడు. ఆమె ఫిర్యాదుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు. ఆదివారం రాత్రి మేజిస్ట్రేట్ ముందు హాజరుపెట్టగా రిమాండ్‌కు ఆదేశించారు. సముద్రాల పవన్‌కుమార్ అలియాస్ లడ్డూ.. పట్టణంలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓ ఎన్నారైపై దాడి చేశాడు. దీంతో పోలీసులు అతడిని పట్టణ బహిష్కరణ చేశారు. తెనాలి రావొద్దని ఆదేశించారు. అయినా రహస్యంగా పట్టణానికి రాకపోకలు సాగిస్తున్నాడు. గత అక్టోబరులో బహిరంగంగానే పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నాడు. ఆ సంబరానికి కూటమి నేతలు హాజరయ్యారు. ఆ తర్వాత మూడురోజులకే అంటే అదే నెల 28వ తేదీ రాత్రి డెకరేషన్ పనులు చేస్తుండే నాజరుపేటకు చెందిన కాకుమాను ఇంద్రజిత్ అనే వ్యక్తిపై అయితానగర్ సెంటర్లోనే లడ్డూ దాడిచేశాడు. వర్కర్‌ను స్కూటర్‌పై ఇంటిదగ్గర దించి తిరిగి వెళుతున్న ఇంద్రజిత్‌పై అకారణంగా లడ్డూ దాడిచేశాడు. అతడి స్కూటర్ తీసుకెళ్లి తగులబెట్టాడు. కూటమి నేతలతో ఉన్న బంధం కారణంగానే లడ్డూ ఇంతకు తెగించాడని అప్పట్లో విమర్శలు వచ్చాయి. మళ్లీ ఇప్పుడు వార్తల్లోకొచ్చాడు.

దూరంగా ఉంచిందని..

తెనాలి సమీపంలో ఓ గ్రామానికి చెందిన ఓ మహిళతో లడ్డూకు పాత పరిచయం ఉంది. ఆమె విజయవాడలో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. కొంతకాలంగా ఆమె లడ్డూను దూరంగా ఉంచింది. ఆగ్రహం చెందిన లడ్డూ శనివారం తనకోసం విజయవాడ వెళ్లి, తనతో గొడవ పెట్టుకున్నాడు. ఆమెను అనుసరించి తెనాలి వచ్చి, తర్వాత ఆమె నివసించే గ్రామానికి వెళ్లాడు.ఆమెను ఊరి వెలుపలికి రమ్మని బెదిరించాడు. తన దగ్గరకు వచ్చిన మహిళపై తీవ్రంగా దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమె ఫిర్యాదుతో రూరల్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. తర్వాత అరెస్టుచేసి, స్థానిక ప్రైవేటు వైద్యశాలలో పరీక్షలు చేయించారు. ఆదివారం రాత్రి మేజిస్ట్రేటు ముందు హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించారు.రూరల్ ఎస్‌ఐ ప్రతాప్ కుమార్ కేసు దర్యాప్తుచేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



గోళ్లపాడు (ముప్పాళ్ల): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని గోళ్లపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కుందురువారిపాలెం గ్రామానికి చెందిన కామేపల్లి చంద్రశేఖర్ (32) తన ట్రాక్టర్‌లో మొక్కజొన్న విత్తనాలు లోడుతో పొలంలో వస్తున్నాడు. పొలంలో ఉన్న గుంతలో పడి డ్రైవర్ సీటులో ఉన్న చంద్రశేఖర్ ఎగిరి కింద పడ్డాడు. చంద్రశేఖర్ గుండెలపై గుండా ట్రాక్టర్, లోడుతో ఉన్న ట్రక్కు వెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.